క్లుప్తంగా

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు


ఎరువుల గోడౌన్‌ను పరిశీలిస్తున్న సీఐ

కంభం: ఉద్దేశపూర్వకంగా ఎరువులను బ్లాక్ చేసి, కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని కంభం సీఐ కె. మల్లికార్జున హెచ్చరించారు. మంగళవారం కంభం పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి మహమ్మద్‌తో కలిసి సీఐ తనిఖీ చేశారు. గోడౌన్లలో యూరియా నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు పరిశీలించారు. రైతులకు అవసరమైన యూరియాను ఎమ్మార్పీ ధరకు విక్రయించాలని స్పష్టం చేశారు. తనిఖీల్లో ఎస్సై నరసింహారావు పాల్గొన్నారు.

ఆర్డీటీ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించాలి


ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు, గిరిజనులు

అర్ధవీడు: ఆర్డీటీ స్వచ్ఛంద సంస్థ సేవలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిలిపేయడం సరికాదని, ఆ సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కన్వీనర్ బొడిచెర్ల రాజు డిమాండ్ చేశారు. మంగళవారం అర్ధవీడు మండలంలోని ఇందిరానగర్‌లో గిరిజనులతో కలిసి ధర్నా నిర్వహించిన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పేదలకు గడిచిన 50 ఏళ్లుగా అండగా నిలుస్తున్న సంస్థను అడ్డుకోవడం వెనుక కుట్ర దాగి ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు నేదరపల్లి జయరాజు, గోన మోహన్‌రావు, కె.సుబ్బారావు, కుమార్, నాగరాజు, గిరిజనులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

- డీఐఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి


వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ పద్మావతి, పక్కన డాక్టర్ రాహుల్

మార్కాపురం టౌన్: ఉచిత వైద్యశిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని మార్కాపురం డీఐఎంహెచ్‌ఓ డాక్టర్ పద్మావతి సూచించారు. పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సీనియర్ మెడికల్ ఆఫీసర్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రాహుల్ ఆధ్వర్యంలో మహిళలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. మున్సిపల్ కమిషనర్ డీవీ నారాయణరావు, డాక్టర్లు పి.శ్రవణ్‌తేజ్, శివారెడ్డి, సోనీ, దంత వైద్యులు జగదీష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నరకానికి అడ్డదారులు!

దారుణంగా తయారైన గ్రామీణ రహదారులు

- అడుగేస్తే ఒళ్లు హూనమయ్యేలా రోడ్లు
- మరమ్మతుల సంగతి మరిచిన పాలకులు

కొనకనమిట్ల:

సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు సిద్ధం చేస్తాం .. ఎంచక్కా కొత్త అల్లుళ్లు రయ్‌మని అత్తారింటికి వెళ్లొచ్చని గతేడాది డిసెంబర్‌లో కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రగల్భాలు పలికిన విషయం తెలిసిందే. మరో నాలుగు నెలల్లో మళ్లీ సంక్రాంతి రానుంది. ఇప్పటికీ గ్రామీణ రోడ్లతోపాటు హైవే రోడ్లు గోతులమయంగా దర్శనమిస్తున్నాయి. కొనకనమిట్ల మండలం వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. చేరెడ్డివారిపల్లి నుంచి సిద్ధవరం గ్రామంలోకి వెళ్లే రోడ్డు నడవటానికి వీలులేని విధంగా గోతులమయమైంది. గొట్లగట్టు నుంచి నాయుడుపేట ఎస్సీ కాలనీ వరకు ఉన్న 3 కిలోమీటర్ల మేర తారు రోడ్డు, ఒంగోలు–గిద్దలూరు రహదారిలో బచ్చలకూరపాడు నుంచి తాడివారిపల్లి వరకు ఆర్‌అండ్‌బీ రహదారిపై అడుగడుగునా గోతులు ఏర్పడ్డాయి. గనివానిపాడు రహదారి మధ్యలో ఉన్న చప్టాల వద్ద ఇరువైపులా రోడ్డు కోతకు గురైంది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. అలాగే జాతీయ రహదారిపై మర్రిపాలెం బీసీ కాలనీ సమీపంలో ఏర్పడిన గోతులను తాత్కాలికంగా పూడ్చగా వర్షాల నేపథ్యంలో కంకర లేచింది. ఒకే ప్రదేశంలో మూడు గుంతలు పడటంతో వాహనదారులు రాకపోకల సమయంలో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. గొట్లగట్టు నుంచి వెలుగొండ్రాయునిపల్లి బీసీ కాలనీకి వెళ్లే మట్టి రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు అల్లుకుపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.


గుంతలమయమైన గనివానిపాడు రోడ్డు



గొట్లగట్టు నుంచి నాయుడుపేట ఎస్సీ కాలనీ వెళ్లే రోడ్డు

కంకరతేలిన రోడ్డుపై ప్రజల అవస్థలు

మార్కాపురం: సర్కస్‌లో సన్నతీగపై నడిచినట్టుగా ఈ రోడ్డుపై కూడా టూవీలర్లపై వెళ్లేవారు తమ వాహనాలు నడపాల్సి ఉంటుంది. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా ఇక అంతే.. కిందపడితే కాలో చెయ్యో విరగడం ఖాయం.! రెండు గ్రామాలకు చెందిన వందలాది మంది ప్రజలు మార్కాపురం పట్టణానికి రాకపోకలు సాగించే ఎల్‌బీయస్ నగర్ దారి నరకానికి అడ్డదారిగా మారింది. చింతగుంట్ల నుంచి ఎల్‌బీయస్ నగర్, బిరుదులనరవ గ్రామాలకు వెళ్లాలంటే చిల్లచెట్ల మధ్య కంకర తేలిన రోడ్డుపై సర్కస్ ఫీట్లు చేయాల్సిందే. వందలాది మంది ప్రజలు, విద్యార్థులు భయం గుప్పిట్లో రోజూ రాకపోకలు సాగిస్తున్నారు. అసలే మట్టిరోడ్డు.. ఆపై కంకర తేలడంతో వర్షం పడితే ఎక్కడ కిందపడతామో నన్న భయంతో వాహనదారులు అత్యంత జాగ్రత్తగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. చింతగుంట్ల నుంచి ఎల్‌బీబీస్ నగర్ వరకు సుమారు 3 కిలోమీటర్ల పొడవునా రోడ్డుకు ఇరువైపులా చిల్లకంప అల్లుకుపోయింది. దీంతో ఎదురుగా వచ్చే వాహనం సమీపంచే వరకు కనిపించని దుస్థితి. తరచుగా ఈ రోడ్డుపై ఆటోలు, ద్విచక్రవాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. కంకర రాళ్లు పైకి తేలడంతో ఆటోలు, టూవీలర్లు కూడా పంక్చరవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారురోడ్డు వేయాలని, రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిల్లకంప తొలగించాలని కోరుతున్నారు.


చేరెడ్డివారిపల్లి నుంచి సిద్ధవరం వెళ్లే రోడ్డు దుస్థితి


కంకర లేచి గుంతలతో నిండిన ఎల్‌బీయస్ నగర్ రోడ్డు


వెలుగొండ్రాయునిపల్లెలో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన చిల్లచెట్లు


చింతగుంట్ల - ఎల్‌బీయస్ నగర్ మధ్య చిల్లచెట్లతో నిండిన రోడ్డు

గ్రామ సచివాలయ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

కొమరోలు: రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొమరోలులో ఎంపీడీఓ చెన్నారావుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయ ఉద్యోగులు మాట్లాడుతూ.. తమకు వలంటీర్ల విధులు అప్పగించడం నిలిపేయాలని, సర్వేలు, ఇంటింటికీ అవగాహన పేరుతో మానసిక ఒత్తిడికి గురిచేయొద్దని డిమాండ్ చేశారు. 9 నెలల ప్రొబేషన్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని, ఆరేళ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులకు స్పెషల్ గ్రేడ్ ఇంక్రిమెంట్ అందించాలన్నారు. గ్రామ సచివాలయ ఉద్యోగులను మాతృ శాఖల్లో విలీనం చేయాలని, ఫీల్డ్ వర్క్ చేస్తున్న ఉద్యోగులకు టీఏ, డీఏలు సకాలంలో మంజూరు చేయాలని కోరారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్‌లో మార్పులకు అవకాశం కల్పించాలన్నారు. శాఖల వారీగా సీనియారిటీ జాబితాను విడుదల చేసి, అర్హులైన వారికి ప్రమోషన్ కల్పించాలన్నారు. స్పష్టమైన సర్వీస్ రూల్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలన్నారు. ఈ డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్ ఒకటో తేదీ నాటికి పరిష్కరించకుంటే ఎన్‌టీఆర్ భరోసా పింఛను నగదును పంపిణీని నిలిపివేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు శ్రీనివాసనాయక్, శ్రీనివాసులు, కృష్ణానాయక్, చాణక్య, నాగార్జునరెడ్డి, జయరామ్ పాల్గొన్నారు.


ఎంపీడీఓ చెన్నారావుకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగుల జేఏసీ నాయకులు

బలిజ కులస్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు

- కాపు సంఘం ఆధ్వర్యంలో డీటీకి వినతి

మార్కాపురం: రాష్ట్ర ప్రభుత్వం దొమ్మర కులం పేరును గిరిబలిజగా మార్పు చేస్తూ జీవో ఇవ్వడం వల్ల బలిజ కులస్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని, ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని కోరుతూ మార్కాపురం కాపు సంఘం నాయకులు మంగళవారం డీటీ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. రాయలసీమ జిల్లాల్లో బలిజలు కాకుండా కాపు అనే సర్టిఫికెట్‌తో ఇతరులు కాపు కార్పొరేషన్ రుణాలు పొందుతున్నారని, దీనిపై విచారణ చేపట్టి పరిస్థితిని చక్కదిద్దాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాలో కాపు భవనాలు ఏర్పాటు చేస్తామని చెప్పి ఇంతవరకు స్థలంగానీ, నిధులుగానీ కేటాయించ లేదని విమర్శించారు. 70 ఏళ్ల నుంచి పోరాటం చేస్తున్న బలిజ, తెలగ, కాపు, ఒంటరి కులాలను బీసీ జాబితాల్లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాపు సంఘ నాయకులు రఘుపతి శివ, గురవయ్య, తిరుమలశెట్టి వీరయ్య, మర్రి రమణ, ఆకుల వెంకటేశ్వర్లు, అందె నరేష్, గిరి, సుబ్బారావు, నరసింహారావు పాల్గొన్నారు.


డీటీకి వినతిపత్రం ఇస్తున్న కాపు సంఘ నాయకులు

అడ్డగోలుగా రోడ్డు పనులు.. ప్రజలకు అవస్థలు

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన టిప్పర్
- గత సోమవారం టిప్పర్ చక్రాల కింద నలిగి యువకుడు మృతి

కొనకనమిట్ల: ఒంగోలు–కర్నూలు ప్రధాన రహదారిలోని గొట్లగట్టు బస్టాండ్ సెంటర్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు అడ్డగోలుగా సాగుతున్నాయి. దీంతో వాహనదారులు, ప్రజలు అవస్థలు ఎదుర్కొంటున్నారు. రహదారి విస్తరణ పనుల్లో భాగంగా ఇరువైపులా మార్జిన్లు సరిచేసి, విద్యుత్ స్తంభాలు తొలగించి.. వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. అయితే కాంట్రాక్టర్ అవేమీ చేయకుండా రహదారికి ఇరువైపులా 5 అడుగుల మేర మార్జిన్ చదును చేసి పనులు చేపట్టారు. ఒక వైపు ఇరుకుగా ఉన్న మార్గంలో వాహనాలు ఎదురుపడినప్పుడు ట్రాఫిక్ జామ్ అవుతోంది. వాహనాలు పక్కకు తొలగే క్రమంలో విద్యుత్ స్తంభాలను ఢీకొంటున్నాయి. సోమవారం ఇరుకుగా ఉన్న రోడ్డులో ఎదురెదురుగా టిప్పర్, మోటార్ సైకిల్ వస్తుండగా సంభవించిన ప్రమాదంలో ఓ యువకుని నిండుప్రాణాలు గాల్లో కలిశాయి. ఇదిలా ఉండగా మంగళవారం రోడ్డు మార్జిన్‌లోని విద్యుత్ స్తంభాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో మధ్యలో విరిగిపోయింది. ఇంకొంచెం బలంగా తగిలి ఉంటే స్తంభం కిందపడి పెను ప్రమాదం సంభవించి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్‌శాఖ అధికారులు రోజంతా శ్రమించి నూతన స్తంభం ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో కొన్ని గంటలపాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సీసీరోడ్డు పూర్తి కావడానికి సుమారు 2 నెలల సమయం పడుతుందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులతోపాటు స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.



ట్రాఫిక్‌లో నిలిచిన వాహనాలు


టిప్పర్ ఢీకొనడంతో విరిగిన స్తంభం

ఉచిత ఇసుక హామీని అమలు చేయాలి

గిద్దలూరు రూరల్: ఉచిత ఇసుక హామీని అమలు చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ డీటీ ఇబ్రహీమ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉచిత ఇసుక పంపిణీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. గిద్దలూరు పరిధిలోని సగిలేరు వాగులో ఎర్ర ఇసుక తెచ్చుకుంటున్న స్థానికులను అధికారులు అడ్డుకోవడాన్ని తప్పుబట్టారు. భవన నిర్మాణాలకు సరిపడా ఇసుకను ప్రభుత్వం సరఫరా చేయకపోగా ధరలు విపరీతంగా పెంచడం దారుణమన్నారు. ఇళ్ల నిర్మాణం ఆగిపోవడం వల్ల కార్మికులు పనులు లేక పస్తులు ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికంగా లభించే ఎర్ర ఇసుకను ఎవరి స్వార్థం కోసం కట్టడి చేస్తున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు థామస్, భవన నిర్మాణ కార్మికుల సంఘ నాయకులు నారాయణ, ఆబేల్, రాంబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.


ఇసుక సమస్యపై డీటీకి అర్జీ ఇస్తున్న సీఐటీయూ నాయకులు

ఫ్లోరైడ్ నీటితో అనారోగ్యం


పెద్ద ఓబినేనిపల్లెలో ఫ్లోరోసిస్‌పై అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారి అనిల్‌కుమార్

బేస్తవారిపేట: అధిక పరిమాణంలో ఫ్లోరైడ్ ఉన్న నీటిని తాగడం ద్వారా ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తుందని, వ్యాధులు చుట్టుముడతాయని జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి అనిల్‌కుమార్ పేర్కొన్నారు. జాతీయ ఫ్లోరోసిస్ నియంత్రణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పెద్ద ఓబినేనిపల్లెలో నీటి పరీక్షలు చేశారు. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ స్థాయిలను నిరంతరం పర్యవేక్షించడం ద్వారా ఫ్లోరోసిస్ వ్యాధి బారి నుంచి రక్షణ పొందవచ్చునన్నారు. ఫ్లోరోసిస్ ఎముకలను, దంతాలను ప్రభావితం చేస్తుందని పేర్కొన్నారు. నివారణ మార్గాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మోక్షగుండం పీహెచ్‌సీ వైద్యాధికారి వికాస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు, కాట్రగుంట గ్రామాల్లో ఫ్లోరైడ్ నీరు, ఫ్లోరోసిస్ వ్యాధి ప్రభావంపై జిల్లా ఫ్లోరోసిస్ నియంత్రణాధికారి అనిల్‌కుమార్ అవగాహన కల్పించారు.కాట్రగుంటలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారులు ఎస్పీ.బాలయ్య, నరేంద్ర, ఎంపీహెచ్‌ఎస్ జె.వెంకటేశ్వర్లు, సంయుక్త, గౌతమ్, శిల్ప, విజయకుమారి, శ్రావణి, ఏఎన్‌ఎంలు కెతూర, కృష్ణకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: ఆర్‌డీఎస్‌ఎస్ పనుల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. రెడ్డిచెర్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మిట్టమీదిపల్లె, బ్రాహ్మణపల్లె, యర్రపల్లె గ్రామాల్లో బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

భువనేశ్వరిగా వాసవీమాత.. ఆదిలక్ష్మి రూపంలో రాజ్యలక్ష్మి


మార్కాపురం : ఆదిలక్ష్మి అవతారంలో రాజ్యలక్ష్మి మాత


మార్కాపురం : వెండి చెవుల అలంకరణలో అమ్మవారు


బేస్తవారిపేట : వెండితొడుగు అలంకరణలో పట్టాభిరామస్వామి


గిద్దలూరు : కనకదుర్గమ్మ ఆలయంలో గాయత్రిమాతగా..


బేస్తవారిపేట : భువనేశ్వరీదేవి అలంకారంలో వాసవీమాత


మార్కాపురం : సావిత్రిగా వాసవీమాత


కొనకనమిట్ల : గొట్లగట్టు రామాలయంలో భక్తుల పూజలు

బేస్తవారిపేట: దసరా శరన్నవరాత్రి వేడుకలు గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గంలో వైభవంగా సాగుతున్నాయి. మంగళవారం రెండో రోజు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. విశేష పూజల అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బేస్తవారిపేటలోని వాసవీ మాత ఆలయంలో అమ్మవారిని భువనేశ్వరీదేవిగా, గొట్టమిండ్ల సమీపంలోని కోట సత్యమాంబదేవి ఆలయంలో అంబా భవానీదేవిగా, సోమవారిపేటలోని చౌడేశ్వరీదేవిని బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరులోని నల్లబండ బజారులో కనకదుర్గమ్మ ఆలయం, వాసవి మాత ఆలయం, రేడియో బావి సమీపంలోని కాళికామాత ఆలయం, కాశినాయనకుంట గాయత్రిమాత ఆలయాల్లో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కొమరోలు: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు.

బ్రహ్మచారిణిగా జగదాంబ మాత

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో జగదాంబ అమ్మవారు బ్రహ్మచారిణిగా, శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో రాజ్యలక్ష్మి అమ్మవారు ఆదిలక్ష్మిగా, వాసవీ మాత ఆలయంలో అమ్మవారు సావిత్రిగా, అమలక లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

కొనకనమిట్ల: మండలంలోని గొట్లగట్టు రామాలయం, పెదారికట్ల మహాలక్ష్మమ్మ ఆలయం, శివాలయం, రేగడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం, కొనకమనిట్ల రామదూతక్షేత్రంలలో అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

పట్టాభిరాముడికి వెండి తొడుగు బహూకరణ

బేస్తవారిపేట: స్థానిక తేరుబజార్‌లోని పట్టాభిరామస్వామి ఆలయంలో మూలవిరాట్‌కు రూ.4 లక్షల విలువైన వెండి తొడుగును దాత విశ్వనాథుని వెంకటేశ్వర్లు, మహాలక్ష్మమ్మ దంపతులు బహూకరించారు. అర్చకులు ఓరుగంటి సుబ్రమణ్యశర్మ, సాయి శర్మ,ఆధ్వర్యంలో స్వామివారికి అలంకరించి పూజలు చేశారు. దాతలను ఆలయ ధర్మకర్త వాగిచర్ల యల్లారావు సత్కరించారు.

పోలేరమ్మతల్లికి వెండి చెవులు

మార్కాపురం: దసరా నవరాత్రులను పురస్కరించుకుని మార్కాపురం కాలేజీ రోడ్డులోని పోలేరమ్మ తల్లికి డి.నందకుమార్, ప్రత్యూష దంపతులు వెండి చెవులను బహూకరించినట్లు ఆలయ కమిటీ ప్రతినిధి డి.చెన్నకేశవులు తెలిపారు. మంగళవారం అమ్మవారిని గాయత్రీదేవీగా అలంకరించామని, బుధవారం అన్నపూర్ణాదేవి రూపంలో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు.